ప్రజాశక్తి

గురువారం 29 ఫిబ్రవరి 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

సమన్వయకర్తల మార్పు

- గుంటూరు లోక్‌సభకు కిలారు రోశయ్య
- పొన్నూరుకు అంబటి మురళీకృష్ణ
- ఉమ్మారెడ్డి రమణ వెనుకడుగుతో మార్పులు





ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి సమన్వయకర్తల్లో మళ్లీ మార్పులు జరిగాయి. గుంటూరు లోక్‌సభకు ఇటీవల ప్రకటించిన ఉమ్మారెడ్డి వెంకట రమణ పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో ఆయన స్థానంలో వెంకట రమణ బావ,పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యను నియమించారు. ఈమేరకు గుంటూరు లోక్‌సభ నుంచి రోశయ్యను పోటీ చేసేలా అధినాయకులు ఒప్పించారు. అలాగే పొన్నూరులో కిలారి రోశయ్య స్థానంలో

మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీని సమన్వయకర్తగా నియమించారు. ఈమేరకు మంగళవారం రాత్రి వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కిలారి రోశయ్య తొలుత గుంటూరు లోక్‌సభకు పోటీ చేయడానికి ఆసక్తి చూపగా పలువురు కొత్తనేతలను వైసిపి అధిష్టానం తెరపైకి తెచ్చింది. క్రికెటర్ అంబటి రాయుడు ఏడాదిపాటు జిల్లాలో పర్యటింపచేశారు. వైసిఎ నాయకులతో కలసి ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. అధికారికంగా డిసెంబరు 28న

వైసిపిలో చేరిన అంబటి రాయుడ్ని గుంటూరు లోక్‌సభకు ఎంపిక చేస్తారని ప్రచారం జరిగింది. అయితే 10 రోజులకే ఆయన పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. దీంతో ఈ స్థానంపై పలువురు పేర్లు తెరపైకి వచ్చినా 15 రోజుల క్రితం ఉమ్మారెడ్డి రమణను నియమించారు. ఆయన పోటీనుంచి తప్పుకోవడంతో చివరికి రోశయ్యకు అవకాశం ఇచ్చారు. అలాగే రోశయ్య స్థానంలో పొన్నూరుకు ఎంపిక చేసిన అంబటి మురళీ గతకొంత కాలంగా పలు భజరంగ్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. అయితే అంబటి మురళీకి అవకాశం ఇవ్వడం వల్ల సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబుకు పోటీ చేసే అవకాశం ఇస్తారా లేక ఆయన్ను మరో నియోజకవర్గంకు పంపిస్తారా అన్న చర్చ ప్రారంభంఅయింది. సత్తెనపల్లి నుంచి మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డిపేరు మళ్లీ తెరపైకి వచ్చింది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల తాను ఈ ఎన్నికల్లో పోటీచేయనని చెప్పడంతో ఆయన్ను గుంటూరు లోక్‌సభకు పోటీ చేయించాలన్న ప్రయత్నానికి గండిపడింది.

చిలకలూరిపేట సమన్వయకర్తగా ఉన్న మల్లెల రాజేష్ కొనసాగింపుపై పార్టీ నేతల్లో అనేక సందేహాలున్నాయి. అంబటి రాంబాబును చిలకలూరిపేటకు మారుస్తారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పటికే సత్తెనపల్లి నుంచి అంబటి రాంబాబు ప్రచారాన్ని ప్రారంభించారు. సత్తెనపల్లిలో రాంబాబుకు, పొన్నూరులో మురళీకి అవకాశం కల్పించడం కూడా చర్చనీయాంశం గామారింది. ప్రస్తుతం పొన్నూరు నుంచి అంబటి మురళికి అవకాశం ఇవ్వడంతో తెనాలి నుంచి సినీనిర్మాత దాసరి కిరణ్‌కు అవకాశంలేనట్టేనని చెబుతున్నారు. తెనాలి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కొనసాగిస్తారని తెలిసింది. ఎన్నికల షెడ్యూలు వచ్చేలోగా పలు నియోజ కవర్గాల నుంచి అభ్యర్థులకు స్థాన చలనం లేదా మార్పు వుండవచ్చుననే ప్రచారం ఉంది.



ధర్నాలో మృతదేహం వద్ద మృతుడు కోటయ్య భార్యా, పిల్లలు, కార్మికులు

మృతదేహంతో కార్మికుల ధర్నా

మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని అధికారులు హామీ

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఎస్‌పి తుషార్ దూడి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత గుంటూరు, మంగళగిరి టౌన్ దుగ్గిరాల పోలీస్‌స్టేషన్లను పరిశీలించి కేసుల వివరాలు, నేర నియంత్రణ చర్యలు, శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యమైన కేసులు, జిల్లా సరిహద్దు ప్రాంతాల వివరాలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, గత ఎన్నికల తాలూకా నేరాలు, సంఘటనలు తదితర అంశాలపై చర్చించారు. టౌన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్ రహదారి రూట్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఎన్నికల అనుభవాలను, అప్పటి సంఘటనలను దృష్టిలో పెట్టుకొని విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ముందస్తు ప్రణాళికలు, చర్యలు అవసరమని చెప్పారు. గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా చట్టపరమైె చర్యలుండాలన్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా పెట్టాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని అదేశించారు. ఎఎస్‌పి నిచికేట్ షేల్కి, ఆయా స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకురాలు నాగమ్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకురాలు నాగమ్మ అవార్డులను 7వ తేదీన ప్రదానం చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. వ్యాపార, విద్య, కళలు, క్రీడా రంగాల్లో ప్రతిభ చాటిన జిల్లా మహిళలకు నాయకురాలు నాగమ్మ పేరుమీద అవార్డులు ఇస్తామన్నారు. వచ్చేనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మహిళా మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ, సిడిపిఒలను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ప్రత్యేక బృందం పరిశీలిస్తుందని, ఇందులో మహిళా-శిశు సంక్షేమ శాఖ, మహిళా అధికారిక శాఖ అధికారిని, పెద్దలు, మీడియా ప్రతినిధి ఉంటారని తెలిపారు. మొత్తం ఐదుగుర్ని ఎంపిక చేస్తామని మొదటి ఒకరికి నాయకురాలు నాగమ్మ అవార్డును బహూకరణతోపాటు రూ.10,116 నగదు బహుమతి, జ్ఞాపిక అందిస్తామని, మరో ఐదుగురికి ప్రశంసా పత్రాలతో సత్కరిస్తామని తెలిపారు. వివరాలకు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ - మహిళా సాధికారిక ఆఫీసర్‌ను సంప్రదించాలని, 9491051745, 7799025664 ఫోన్ నంబర్లలోనూ సంప్రదించొచ్చని వివరించారు.



స్థానిక, ఆదిమ తరగతులపై అధ్యయనం పెరగాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

అస్ట్రేలియా, భారత్‌లలో స్థానిక, ఆదిమ తరగతులపై విస్తృత స్థాయిలో అధ్యయనాలు జరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగంలో 'మార్జినాలిటి అండ్ మల్టీ కల్చరల్ లిటరరీ నేటివ్స్ ఫ్రం అస్ట్రేలియా అండ్ ఇండియా' అంశంపై మూడ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ సిదియోల్ ఫ్రాంక్ హెచ్. దీన (అమెరికా), ప్రొఫెసర్ గిలియన్ డూలే (అస్ట్రేలియా), భారత్‌కు చెందిన ప్రొఫెసర్ ఆర్కే, ధావన్, ప్రొఫెసర్ అంగ్షుమన్ కర్, ప్రొఫెసర్ ఆర్మ్ స్ట్రాంగ్ మాట్లాడారు. భిన్న సంస్కృతులు, దళిత సాహిత్యం, హిజ్రాల జీవన స్థితిగతులపై వచ్చిన పరిశోధనా పత్రాల గురించి మాట్లాడారు. సదస్సు అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భారతదేశ సంస్కృతిని నిలిపేలా ఫోక్ డాన్స్ ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రొఫెసర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.



గుంటూరులో మెగా చెక్కు అందచేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

రైతుభరోసా, సున్నా వడ్డీ నిధులు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అధిక పంట ఉత్పాదకత కోసం, నాణ్యమైన వ్యవసాయ వనరులను సమయానుకూలంగా కొనుగోలు చేయటానికి, సాగుదారులకు మద్దతిచ్చే లక్ష్యంతో రైతు భరోసా పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎల్.శివశంకర్ అన్నారు. ఈ ఏడాదికి మూడో విడతగా రైతు భరోసా-పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు రైతుల ఖాతాలకు బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని బుధవారం సిఎం క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్రకుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం పాల్గొని వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ

▶ 2లో

అమరావతి సామాజిక పింఛను రూ.5 వేలకు పెంపు జీవో విడుదల

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి సామాజిక పింఛనును రూ.5 వేలకు పెంచిన ప్రభుత్వం తాజాగా బుధవారం జీవో జారీ చేసింది. రాజధాని అమరావతిలో భూమి లేని నిరుపేదలకు గత టిడిపి ప్రభుత్వం రూ.2,500 సామాజిక పింఛను కింద అందజేసింది. తాము అధికారం లోకి వచ్చాక అమరావతి పింఛనును రూ.5 వేలకు పెంచుతామని చెప్పిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కూడా రూ.2,500 కొనసాగించారు. అయితే ఫిబ్రవరి 15వ తేదీన తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురంలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పింఛనును పెంచుతున్నట్లు ప్రకటించారు. రాజధాని గ్రామాల్లో అమరావతి సామాజిక పింఛను లబ్ధిదార్లు 17,215 మంది ఉన్నారు. వారందరికీ ఒకటో తేదీ నుండి రూ.5 వేల చొప్పున అందించనుంది. ఈ మేరకు బుధవారం సిఆర్‌డిఎ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

నేడు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ మేళా

ప్రజాశక్తి - తెనాలి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పంపిణీ చేసిన నివేసిన స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న బుధవారం ప్రకటించారు. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలో మొత్తం 20,224 మందికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు లభ్యమయ్యాయని, లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించేందుకు చేపట్టిన రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు 17,903 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 2321 మందికి కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు గురువారం 47వ వార్డులో రిజిస్ట్రేషన్ మేళా జరుగుతుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ టి.రాధిక బుధవారం తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.



సైన్స్ పోటీల్లో బొగ్గరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఈపూరు : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ పోటీలను బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ప్రధానోపా ధ్యాయులు సిహెచ్ వీరప్పయ్య మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడంతోపాటు విజ్ఞాన శాస్త్రంపై మక్కువ పెంచుకొని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల చేయాలని విద్యార్థులకు సూచించారు. ఎగ్జిబిషన్‌లో అనేక నమూనాలను విద్యార్థులు ప్రదర్శించగా ఉత్తమ ప్రాజెక్టుగా బొగ్గరం పాఠశాలకు చెందిన విద్యార్థులు స్వాతి, చంద్ర ప్రథమ స్థానంలో నిలిచారు. ఇనిమెళ్ల పాఠశాలకు చెందిన విద్యార్థుల గీతిక, పవన్ ద్వితీయ స్థానం, ముప్పాళ్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు శైలజ,హర్ష తృతీయ స్థానం సాధించారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

వార్డుల్లో చైర్ పర్సన్ పర్యటన

ప్రజాశక్తి - తెనాలి : వార్డు పర్యటనల్లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ టి.రాధిక పట్టణంలోని 19వ వార్డులో బుధవారం పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించిన అధికారులతో మాట్లాడారు. వ్యాపారులు కాల్వల్లో వ్యర్థాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు ప్రజలు, వ్యాపారులు కూడా సహకరించాలని కోరారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, వార్డు శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

పాఠశాల భవనం నుండి దూకి విద్యార్థిని మృతి


ప్రజాశక్తి-పిడుగురాళ్ల



పాఠశాల భవనం 4వ అంతస్తు నుండి దూకి పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన కొనకొండ్ల రిషిత రిషిత (16) తొమ్మిదో తరగతి నుండి పట్టణంలోని భాష్యం పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న రిషిత బుధవారం ఉదయం పాఠశాలలో సైన్స్‌డే జరుగుతున్న సమయంలో భవనం 4వ అంతస్తుకు వెళ్లిన రిషిత అక్కడి నుండి కిందకు దూకింది. వెంటనే ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి స్థాని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే రిషిత మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. కొద్దినెలలుగా మానసిక సమస్యతో బాధపడున్న రిషిత గతేడాది డిసెంబర్ నుండి పాఠశాలకు రావడం లేదని, పరీక్షల నేపథ్యంలో నాలుగు రోజుల కిందడి నుండే వస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం చెబుతోంది. ఈ మేరకు తల్లిదండ్రుల నుండి రాతపూర్వకంగా లేఖనూ తీసున్నట్లు చెబుతున్నారు. ఇదే విషయాన్ని మృతురాలి మేనమామ కూడా ధ్రువీకరించారు. అమ్మాయికి మానసిక సమస్య కారణంగా రెండు నెలల నుండి హైదరాబాద్‌లోని ఓ మానసిక వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నామని, పరీక్షలు రాయించేందుకు పాఠశాలకు పంపామని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై ఫిర్యాదేమీ రాలేదని, కేసు నమోదు చేయలేదని సిఐ వీరాంజనేయులు తెలిపారు.

సమగ్ర విచారణ చేయించాలి : ఎస్ఎఫ్ఐ

ఇదిలా ఉండగా విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాయికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాఠశాలలో సరైన రక్షణ చర్యలు లేని కారణంగా ఈ ఘటన తలెత్తిందని, ఇది పాఠశాల యాజమాన్యం వైఫల్యమేనని పేర్కొన్నారు.



నరసరావుపేటలో మెగా చెక్కు అందజేత

రైతుభరోసా, సున్నా వడ్డీ నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో 2023-24 సంవత్సరంలో మూడవ విడత కింద 1,26,273 మంది భూ యజమానులు, కౌలు రైతులకు రూ.25.51 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రబీ 2021-22, ఖరీఫ్ 2022 కాలానికి వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద 22,521 మంది లబ్ధిదారులకు రూ.4.38 కోట్లు అందించినట్లు తెలిపారు. ఎవరైనా అర్హులైన రైతులు ఈ విడతలో లబ్ధిపొందకపోతే వారు తమ పిర్యాదులను ఆఇవిల ద్వారా నమోదు చేసుకొనవచ్చని, ఫిర్యాదులు నిర్ణీత సమయంలో ఆర్‌టిజిఎస్ వారిచే పరిష్కారం అవుతాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, పీడీ ఆత్మా రామాంజనేయులు పాల్గొన్నారు.

పల్నాడు కలెక్టరేట్ నుండి కలెక్టర్‌తోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్రి క్రిస్టీనా, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,58,386 మంది రైతులు, 20,076 మంది కౌలు రైతులు, 1719 మంది అటవీ భూమి సాగుదార్లకు రూ.56.70 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాలు కింద 38,476 మంది రైతులకు రూ.10.72 కోట్లు జమ చేసినట్లు వివరించారు. హెన్రి క్రిస్టీనా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, రైతులకు మరే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నారన్నారు. అనంతరం రైతులకు మెగా చెక్కును అందించారు.

కొనసాగుతున్న టెట్ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) పరీక్షలు బుధవారమూ కొనసాగాయి. బుధవారం వివిధ పరీక్ష కేంద్రాల్లో 1782 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1662 మంది హాజరయ్యారు. 130 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ఇతర అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మూడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు బుధవారం 699 మంది అభ్యర్థులకు గాను 647 మంది హాజరయ్యారని, 52 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

ముందస్తు ప్రమాద నియంత్రణపై జోసిల్ కంపెనీలో నేడు మాక్ డ్రిల్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీ ప్రాంగణంలోలో గురువారం ముందస్తు ప్రమాదా నియంత్రణ మాక్ డ్రిల్ నిష్ణాతులైన అనుభవజ్ఞుల సమక్షంలో జరగనుంది. గుంటూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి ఎంవి శివకుమార్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. పరిశ్రమలలో చేట్టాల్సిన భద్రతా చర్యలు, కంపెనీలలో వివిధ విభాగాలలో ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణివ్వనున్నారు. అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించడం లక్ష్యంగా నిపుణుల అవగాహన ఉంటుందని కంపెనీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వివిధ ప్రాంతాలలో ఉన్న 20 కర్మాగారాలలో భద్రతా సిబ్బందితో అవగాహన ఉంటుందని తెలిపారు. శిక్షణలో ఉద్యోగులు, వాటాదారులకు సురక్షితమైన పనిని, వాతావరణాన్ని నిర్ధారించడంలో సమస్య యొక్క పేరు నిబద్ధతను నొక్కి చెబుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి శిక్షణ పరిస్థితిలో పనిచేసే ఉద్యోగులకు, కార్మికులకు ఉద్యోగ సేఫ్టీకి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.

రిజర్వేషన్లపై యూజీసీ ప్రతిపాదనల్ని తిరస్కరించండి

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-గుంటూరు

రిజర్వేషన్లపై యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చేసిన దుర్మార్గపు ప్రతిపాదనల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని తిరస్కరించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్‌లో కేంద్ర విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేరనే సాకుచూపి, ఆ ఖాళీలను డి-రిజర్వ్‌చేసి, వాటిని తిరిగి జనరల్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, అన్ని యూనివర్సిటీలకు, కేంద్ర విద్యాసంస్థలకు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధికార వర్గానికి యూజీసీ అధికారికంగా సిఫార్సులు చేసిందని పేర్కొన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులను కేంద్ర విద్యాసంస్థల్లో అడుగుపెట్టనీయకుండా అన్యాయం చేసి, ఓసీలతో నింపాలనే దురుద్దేశంతో ఈ సిఫారసులు చేశారని, ఈ సిఫారసుల అసలు లక్ష్యం రిజర్వేషన్లను ఎత్తేసే కుట్రని విమర్శించారు. ఈ ఆలోచనల్ని తక్షణమే రద్దు చేయకుంటే దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు ప్రతిపాదనల ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ సమాజానికి భారత రాజ్యాంగం విద్య, ఉద్యోగ రంగాలలో కల్పించిన రిజర్వేషన్లను దూరం చేసి, ఉన్నత విద్యారంగంలో ఎదగనీయకుండా, వారి అభివృద్ధిని అడ్డుకోవాలనే దురుద్దేశంతోనే కొన్ని మనువాద అగ్రవర్ణ పెత్తందారి శక్తులు కుట్రలు చేస్తున్నాయని, ఎట్టి పరిస్థితులలోనూ వారి ఆటలు సాగనీవబోమని స్పష్టం చేశారు.

కోటప్పకొండ దారుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర పండుగ హోదా కలిగిన కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర నలుమూలల నుండి మాత్రమే కాకుండా తెలంగాణ నుండి కూడా లక్షల సంఖ్యలో సందర్శకులు వస్తారని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు రహదార్లను ఆయన బుధవారం పరిశీలించారు. తిరునాళ్ళకు వచ్చేవారు కొండకు ఏ వైపు నుండి ఎక్కువగా వస్తున్నారో అంచనా వేసి అక్కడ ప్రణాళిక రూపొందించి ఆర్-బి అధికారుల సహకారంతో వీలైనంత వరకు రోడ్లను వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు చూస్తామన్నారు. దర్శనం సమయంలో తొక్కిసలాటలు సంభవించకుండా వుండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేసి, పోలీస్, సిబ్బందిని నియమించాలన్నారు. కోటప్పకొండ కొండకు ఆర్టీసీ బస్సులకు సంబంధించి పార్కింగ్ స్థలం, వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ డైవర్షన్ వంటి కొన్ని నియంత్రిత చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ విఎస్ఎన్ వర్మ, ఎస్బి సీఐలు ప్రభాకర్, బాలనాగిరెడ్డి, నరసరావుపేట రూరల్ సిఐ మల్లికార్జునరావు, చిలకలూరిపేట రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తులసి నాయక్ హత్య కేసు

అదుపులో నలుగురు నిందితులు

ప్రజాశక్తి-ఈపూరు : బొల్లాపల్లి మండలం మాలపాడు తండాకు చెందిన తులసి నాయక్ పొలం పనులు ముగించుకొని వస్తుండగా అగ్నిగుండా ల ఎన్ఎస్పి కాలువ కట్టపై హత్యకు గురయ్యాడు. హత్యా ప్రదేశానికి కొద్ది దూరంలోనే మృతుడు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని నిందితులు తగలబెట్టారు. హత్య ప్రదేశాన్ని నరసరావుపేట డిఎస్పి,క్లూస్ బృందాలు,పోలీసు జాగిలాలతో పరిశీలించారు. అనంతరం విచారణ వేగవంతం చేసిన పోలీసులు వారం రోజుల్లో కేసును ఛేదించారు. సేకరించిన సమాచారం మేరకు తులసి నాయక్ భార్యకు దగ్గరి బంధువు ఒకరు ఏడాదిన్నర క్రితం మృతి చెందారు. దానికి తులసి నాయక్ కారణంగా భావించి అతనిపై ఆ మృతుడి కుమారుడు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో బొల్లాపల్లి కి చెందిన అతని స్నేహితుడితో కలిసి తులసినాయక్‌హత్యకు పథకం రచించారు. వీరిద్దరూ గంగులపాలెంలో ఓ వ్యక్తిని సంప్రదించగా కాకినాడకు చెందిన మరో వ్యక్తితో కొంత నగదు సుపారి ఇచ్చి హత్య చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. సుపారి తీసుకున్న వ్యక్తి తులసి నాయక్ కదలికలపై నిఘా ఉంచి, తులసి నాయక్ పొలం నుండి చేసే రాకపోకలను గమనించేందుకు కాలువ కట్టపై ఎత్తైన ప్రదేశాన్ని ఎంచుకున్నాడు. పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్తున్న తులసి నాయక్ ను ముందుగానే సిద్ధం చేసుకున్న పదునైన కర్రతో దాడి చేసి హత్య చేశాడు. హత్య చేసినట్లు రుజువు కోరడంతో కుడిచేతి బొటనవేలును రాయితో కట్ చేసి తీసుకువెళ్లినట్లు తెలిసింది.

వీరనాయకునిపాలెం అక్రమమైనింగ్ పై హైకోర్టు సీరియస్

ప్రజాశక్తి-చేబ్రోలు : మండలంలో వీరానాయకునిపాలెం అక్రమ మైనింగ్ విషయమై అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదలకు ఇచ్చిన భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతుంటే చోద్యం చూస్తున్నారా? కళ్ళకు కనబడటం లేదా?అని ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు వారాల్లో చేబ్రోలు అక్రమ మైనింగ్ వాస్తవిక పరిస్థితులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, ప్రభుత్వ తరపు న్యాయవాదిని ఆదేశించింది. రెండు వారాలు చాలదన్న న్యాయ వాదితో అంత రిక్షానికి వెళ్లి రిపోర్ట్ తేవాలా అని ప్రశ్నించింది. నివేదికల్లో తేడా ఉంటే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపింది. అక్రమ మైనిం గ్ వ్యవహారంపై హైకోర్టులో ఎం.ప్రభుదాస్ పిల్ వేసిన విష యం తెలిసిందే. అతని తరపున న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు. డీకే పట్టా భూమి 60 ఎకరాల్లో రెండు ఎకరాలకు అనుమతి తీసుకుని, ఆ మొత్తం ఎకరాలకు ఫెన్సింగ్ వేసి ఎవరిని రానివ్వకుండా మైనింగ్ చేస్తు న్నారని హైకోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను చూపించారు. డీకే పట్టా భూముల్లో మైనింగ్ ఎలా చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది.

బీరువా పగలగొట్టి బంగారు నగలు చోరీ



ప్రజాశక్తి-కొల్లిపర

ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ జరిగిన ఘటన మండల కేంద్రమైన కొల్లిపరలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపరకు చెందిన రావూరు నాగలక్ష్మి బుధవారం రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగ నిమిత్తం ఉదయం 10 గంటలకు వెళ్లింది. మధ్యాహ్నం భోజన సమయానికి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడం ఆమె గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి, అందులో ఉన్న రెండు తులాల బం గారం గాజులు, నల్లపూసల గొలుసు, నాలుగు గ్రాముల ఉంగరం, రూ. 2000 నగదు చోరీకి గురైన విషయాన్ని గుర్తించింది ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్సై రవీంద్రారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు.

మనస్థాపంతో వెళ్లిపోయిన భర్త



శివశంకర్ ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని మనస్థాపానికి గురైన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా వెతికి అతనిని వారికి అప్పగించారు. పట్టణ వన్ టౌన్ సిఐ దశరథ రామయ్య వెల్లడించిన వివరాల ప్రకారం తాపీ పని చేసుకునే ముద్రగడ గోపయ్య రెండేళ్ల క్రితం వట్టిచెరుకూరు మండలం, కర్నూతల గ్రామం నుంచి వచ్చి తెనాలి నాజర్ పేటలో తన అమ్మమ్మ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతని భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్థాపానికి గురైన గోపయ్య ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్ళిపోతున్నట్లు లెటర్ రాసి అదృశ్యమయ్యాడు. ఈ నేపథ్యంలో గోపయ్య అమ్మమ్మ దుర్గ పట్టణ వన్ టౌన్ పోలీసులకు 26 న ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గోపయ్యను పట్టుకుని బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధాని ప్రాంతం వెంకటపాలెం టిటిడి కళ్యాణ మండపం దగ్గర సీడ్ యాక్సెస్ రోడ్డు ఎండింగ్ పాయింట్ వద్ద బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుని వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయసు మధ్య ఉం టుందని, గొంతు కుడి వైపు,ఎడమ రొమ్ము పైన పుట్టుమచ్చలు, ఎత్తు 5 అడుగుల 10అంగుళాలు,చామన ఛాయ, బట్టతల కలిగి ఉన్నాడని సిఐ షేక్ సుభాని తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440900860 ఫోన్ నంబర్ కు తెలియజేయాలని సిఐ కోరారు.



బాల్య వివాహాలను అరికట్టాలంటూ ర్యాలీ

ప్రజాశక్తి-అచ్చంపేట

బాల్య వివాహాలను అరికట్టాలంటూ అంగన్వాడి టీచర్లు బుధవారం అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు ముందుగా అచ్చం పేట కస్తూరి బా పాఠశాలలోని బాలికలకు బాల్య వివా హాలపై అవగాహన కల్పించారు అంతే కాకుండా సమాజంలో ప్రస్తుతం బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి వివరించారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు బాలికలు సమస్యలు ఏమైనా ఉంటే అధైర్య పడవద్దని ఎదుర్కోవాలని చెప్పారు. యువకులు ఎవరైనా బెదిరించిన, తప్పుగా ప్రవర్తించిన తల్లిదండ్రులు కానీ, బంధువులు కానీ వెంటనే తెలియజేయాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ స్వరూపారాణి, సూపర్వైజర్లు ఎన్. మాణిక్యం, బి. బాలత్రిపుర సుందరి, అంగన్వాడి టీచర్ అరుణ పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,16,503
మిర్చి ఎగుమతి	: 1,39,349
మిర్చి నిల్వ	: 96,590

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 20,000
నెం.5	12,000 - 17,000
273	9,000 - 19,500
341	8,500 - 20,500
4884	8,500 - 17,800
సూపర్ 10	11,500 - 19,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	10,500 - 20,000
దేవనూరు డీలక్స్	10,000 - 20,000
తాలుకాయలు	5,000 - 12,500

పలు పాఠశాలల్లో సైన్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో, హర్ష హైస్కూల్లో,కారంపూడి రోడ్డు లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లలో నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సైన్స్ డే సందర్భంగా పాఠశాలలలో టీఎల్ఎం మేళ ప్రతిబింబాలు మురికి నీరు నుండి పరిశుభ్రమైన నీటిని ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. స్థానిక గీతాంజలి స్కూల్స్‌ల సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. కృష్ణవేణి మాట్లాడారు. సైన్స్ నమూనాల ప్రదర్శనలో చిన్నారులు తయారు చేసిన



వినుకొండలోని శ్రీ చైతన్య, గీతాంజలి, గుడ్ షెఫర్డ్ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం

సైన్స్ ఫెయిర్ నిర్వహించి సర్ సివి రామన్ కు నివాళులర్పించారు. ఆయా వేడుకల్లో వినుకొండ విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా, కౌన్సిలర్ షేక్ షకీల, రెవరెండ్ ఫాదర్ వినోద్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు వారు తయారు చేసినటువంటి ప్రయోగాత్మక నమూనాలు , తాజ్ మహల్, చార్మినార్ వాతావరణ కాలుష్య నివారణ, నీటి శుద్ధికరణ యంత్రం, కేలిడియోస్కోప్, పెరిస్కోప్, ఇస్రో రాకెట్ నమూనా మొదలైనవి ఆకట్టుకున్నాయి. వినుకొండ లోని గుడ్ షెఫర్డ్ పాఠశాల లో సుమారు 80 సైన్స్ నమూనాలు ఏర్పాటు చేసి ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి. ఇన్నరెడ్డి ప్రారం భించారు.



టీ కొట్టిన మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. ప్రజాదృష్టి తమమీదకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి అంబటి రాంబాబు టీ మాస్టర్‌గా అవతారం ఎత్తారు. సత్తెనపల్లి పట్టణంలో తన ప్రచారంలో భాగంగా స్థానిక ఐదులాంతర్ల సెంటర్‌లోని టీ దుకాణం వద్దకు వెళ్లిన మంత్రి తానే స్వయంగా టీ చేసి అక్కడున్న వారికి అందించారు. అనంతరం టిఫిన్ బండి వద్దకెళ్లి చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.



6 నాటికి తిరునాళ్ల పనులు పూర్తవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా 8వ తేదీన కోటప్పకొండ తిరునాళ్ల నేపథ్యంలో పనులను 6వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ఇతర అధికారులు, నాయకులతో కలిసి కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు.



తిరుమల ఇంజినీరింగ్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసరావుపేట

జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులకు పిసిబి డిజైన్ మీద మైక్రోలింక్ విజయవాడ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ మాట్లాడుతూ పుస్తక జ్ఞానంతోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ సంపాదించిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఈసీఈ విభాగాధిపతి టి.జగదీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చదివిన కాన్సెప్ట్ ప్రాక్టికల్‌గా చేసినప్పుడు విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెక్కలు ముక్కలు చేసుకునే మాకు పథకాల రద్దా?

- **భవన నిర్మాణ కార్మికుల ఆవేదన - రిలేదీక్షలు ప్రారంభం**
- **సంక్షేమ బోర్డు పథకాల పునరుద్ధరణకు డిమాండ్**



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెక్కాడితే కానీ డొక్కాడని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అవసరం లేదని ప్రభుత్వ పెద్దలు మాట్లాడడం తగదని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్కు వద్ద ధర్నా చౌక్‌లో రెండ్రోజుల రిలేదీక్షలను బుధవారం ప్రారంభించారు. దీక్షాపరులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ పూలమాలలేసి మాట్లాడారు. రాష్ట్రంలోని కార్మిక వర్గంలో సింహభాగం భవన నిర్మాణ కార్మికులని, 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలు నిలిపివేయడం దారుణమని అన్నారు. రానున్న ఎన్నికల్లో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఓట్లు కూడా వైసిపి వేయకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో గుర్తించాలని సూచించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్‌మసూద్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో మాత్రం భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయాల్సిన పథకాలను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని, 1214 జీవో తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షల బీమా, వివాహ, ప్రసవ కానుకలు, వృత్తి పరమైన పనిముట్లు తదితర సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోనూ అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో భవననిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి రూ.2 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించదిన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సురేష్, కోశాధికారి ఎ.ఆంజనేయులు, సహాయ కార్యదర్శి కె.ఆంజనేయులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.శ్రీను, రొంపిచర్ల మండలం కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు, శివ, పఠాన్ మస్తాన్‌వలి, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే మహాధర్నాలు



ప్రజాశక్తి-ముప్పాళ్ల

తమకిచ్చిన హామీలను విస్మరించి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ) సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీసాహెబ్ విమర్శించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విఆర్ఎల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే వారం రోజుల్లో గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరిస్తానని గత ఎన్నికలప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని, ఐదేళ్లవుతున్నా ఆ మాటను నెరవేర్చలేదని అన్నారు. వేతనం ఒక్క రూపాయి కూడా పెంచకపోగా డిఎ రికవరీ పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా త్వరలో కలెక్టరేట్ల వద్ద మహాధర్నా, ప్రదర్శనలు చేపడతామని, విఆర్ఎలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తమ పోరాటానికి అన్ని ప్రజా సంఘాలూ మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి బుడే, కోశాధికారి సరిత, శ్రీకాంత్, సుభాని, శివపార్వతి, గాలయ్య, తిరుపతయ్య, సైదా పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా విద్యార్థులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కాలేజీల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందటం ఆహ్వానించదగ్గ విషయమని, దీనివల్ల పర్యావరణానికి ఏమాత్రం ముప్పువాటిళ్ల కూడదని లిటిల్ జెమ్స్ స్కూల్ చైర్మన్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శాఖమూరి బాజీబాబు అన్నారు. పట్టణంలోని రెడ్డినగర్‌లోని స్కూల్లో ఏర్పాటుచేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనను ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సైన్స్ అభివృద్ధి చెంది పలు ఉపకరణాలు అందులో అందుబాటులోకి రావడం వల్ల మానవ జీవితం సుఖవంతమైందన్నారు. విజ్ఞాన శాస్త్ర ఫలాలు సామాన్య ప్రజలకు అందరికి అందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ లింగ అనంతరామయ్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాలతో



ప్రదర్శన ఏర్పాటు చేశారు. నమూనాల గురించి మిగతా విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.సుధ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి మనవుల జీవన ప్రమాణాలు పెంచుకోగలిగామని, అందరికీ సరిపడా ఆహారం ఉత్పత్తి చేసుకోగలుగుతున్నామని చెప్పారు. మూఢ నమ్మకాలను విశ్వసించొద్దని చెప్పారు. తొలుత సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, టి.కుమారి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ డేలో ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడారు. జ్ఞానం నుంచి విజ్ఞానం ప్రసాదించిన భారత భౌతిక శాస్త్రవేత్త సర్.సివి.రామన్ 1928లో రామన్ ఎఫెక్ట్ కనుగొన్నారని చెప్పారు. అందుకే 1968లో భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే గా ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సంవత్సరం గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్ అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు తాము చేసిన ఎలక్ట్రికల్ సైకిల్, స్మార్ట్ డస్ట్ బిన్, డ్రోన్, ప్లాంట్‌ఇరిగేషన్ లాంటి ప్రయోగాలను ప్రదర్శించారు. అకడమిక్ డైరెక్టర్ డి.నాగేశ్వరరావు, వై.శ్రీకాంత్, జె.మల్లారెడ్డి, ఎన్.శ్రీదేవి, బి.సుమలత పాల్గొన్నారు.



త్యాళ్లూరులో రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.అటల్ ల్యాబ్‌లో జరిగిన సైన్స్ వర్క్‌షాప్ లో విద్యార్థులు ఎల్.ఇ.డి విద్యుత్ బల్బులను తయారు చేయగా వాటిని తల్లిదండ్రులకు అందించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు తయారు చేసి ప్రయోగించిన రాకెట్ లాంచింగ్ ప్రయోగం అబ్బురపరిచింది. వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ నమూనాను ఎంపిక చేసి బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కె.వి సుబ్బారావు పర్యవేక్షించగా హెచ్ఎం శ్రీనివాసరెడ్డి,విద్యాకమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

అగ్నిగుండాల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆన్‌ఛార్జి హెచ్ఎం తావూరియా నాయక్ పర్యవేక్షణలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులు, బోర్డులు, చార్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రామారావు, సుభాని, శైలజ, తులసి, రామ కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుండి అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల దీక్షలు

ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతుల జాబితాను బహిర్గత పరచాలని పలు రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చెసారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి మాట్లాడారు. మార్చి 1, 2, 3 తారీకుల్లో దుగ్గిరాల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే రిలే నిరాహార దీక్షలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఘటన జరిగి 40 రోజులు గడుస్తున్న ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రూ 100 కోట్లు నష్టపోయిన రైతులకు ప్రస్తుత ప్రస్తుత మార్కెట్ ధర ప్రకా రం క్వింటాళ్లకు రూ 12 వేలు ధర చెల్లించాలని, అశ్రద్ధ వహిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ మార్చి 1న జరిగే రిలే నిరాహార దీక్షను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించ నున్నారని తెలిపారు. పసుపు రైతులకు మద్దతుగా వరి, జొన్న, మొక్కజొన్న, నిమ్మ రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ విపత్తుల నిదుల నుంచి ఆర్థిక వనరులను కేటాయించి పసుపు రైతులను ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో తెనాలి, దుగ్గిరాల మండల రైతు సంఘం అధ్యక్షుడు మద్దన సాంబశివరావు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, కొల్లూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

ప్రజాశక్తి-గుంటూరు :విద్యార్థుల్లో శాస్త్రీయ అలోచనలు పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని అప్‌కాస్ట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ దినోత్సవం గుంటూరు పరీక్షా భవన్‌లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు సైన్స్‌క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ అంశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు నిశిత పరిశీలన, ప్రయోగాల పై ఆసక్తిని పెంపొందించుకో వాలన్నారు. సైన్స్ అభివృద్ధితోనే దేశాభివృద్ధి ఆధార పడిందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృకృథం అలవర్చేందుకు సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల ఎంఈఓలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, బలిరామ్ నాయక్, ఉర్దూ డిఐ ఖాసిం, హెచ్‌ఎం తిరుమలేష్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా, డిఎస్ఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-గుంటూరు : సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యం అవుతుందని, విద్యార్థులు ప్రతి విషయాన్నీ శాస్త్రీయంగా ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. జెవివి ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ కాసు శాయమ్మ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ బాల్యం నుండి శాస్త్రీయ అంశాలపై అవగాహన పెంచుకొని, ప్రతి విషయాన్నీ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమానికి సైన్స్ ఉపాధ్యాయులు ఐ.ఏడుకొండలు అధ్యక్షత వహించారు.

ప్రజాశక్తి తెనాలి :స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ వి దాసరి పర్యవేక్షణలో విద్యార్థులు తొలుత పాఠశాల నుంచి చినరావూరు పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు శాస్త్రవేత్తలు, వారు కనుగొన్న అంశాలపై ఫోటోలతో ప్రదర్శన నిర్వహించారు.

ప్రజాశక్తి - తాడేపల్లి :ఎంటిఎంసి పరిధిలోని నులకపేట శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హెల్త్ సెక్రటరీ కే.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ, వివి రామారావు,ప్రిన్సిపల్ కే అనిల్ కుమార్ తదితరులు విద్యార్థులు బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతి లోని విట్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అండ్ ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంట్రప్రెన్యూర్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు జరిగాయి. ముఖ్య అతిధిలుగా పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి గౌరవ అతిథిగా యడ్లపల్లి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో విసి ఎస్ వి కోటా రెడ్డి , డాక్టర్ బిజయ్‌కుమార్ సాహూ, డాక్టర్ వెంకట రమణ, ఎండి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి విజె డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శంకర్, సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : పట్టణంలోని షరాఫ్ బజార్ నందు శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి నాయకులు బుర్ర ముక్కు వేణు గోపాల స్వామి రెడ్డి,ఈదులమూడి డేవిడ్ రాజు ముఖ్య అతిథులుగా ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు.

ప్రజాశక్తి చేబ్రోలు : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎంఇఒ ఏవీహెచ్ ప్రసాద ఆర్ సుబ్బారావు తెలిపారు. నారా కోడూరు జడ్‌పిహెచ్ స్కూలులో సైన్స్‌దినో త్సవం నిర్వహించారు. సైన్స్ డేలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు.


గుంటూరులో వివిధ పోటీల్లో గెలుపొంది బహుమతులు అందుకున్న విద్యార్థులు



జెవివి సభలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్


తాడేపల్లిలో


మంగళగిరిలో


మంగళగిరిలో



యువతను ప్రోత్సహించండి : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యువతను ప్రోత్సహించడానికి వ్యాపారవేత్తలు ముందుకు రావాలని టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. గుంటూరులోని ఒక హోటల్‌లో బుధవారం బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారంలో దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాను 75 డాలర్లతో ప్రారంభించిన తన బిజినెస్ క్రమక్రమంగా పెరిగిందని, అయితే యు.ఎస్ లో ఉన్న పాలనా విధానాలు తనకు సహకరించడం వల్ల తాను ముందుకు వెళ్లానని తెలిపారు. 24 ఏళ్లుగా తాను ఏ ఒక్కరి సహాయం అర్థించాల్సిన అవసరం రాలేదని చెప్పారు. తాను ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి వ్యాపారాల్లో ఎదగాలనుకునే వారికి అండగా ఉంటానని, వారి వ్యాపా రాల ఎదుగుదలకు, విస్తరణకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఒక పాజిటివ్ ఎకనామిక్ పరిస్థితి ఏర్పడినప్పుడే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని పెమ్మసాని తెలిపారు.



టిడిపిలో కార్యకర్తలకు గుర్తింపు : లోకేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపిలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. తాడేపల్లిలోని నారా లోకేశ్ నివాసంలో టిడిపి నేతలో కలసి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ పరిచయ కార్యక్రమం బుధవారంసాయంత్రం జరిగింది. లోకేశ్ మాట్లాడుతూ పెమ్మసాని కుటుంబానికి టిడిపిలో ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని చెప్పారు. కష్టపడి పని చేయడంలో పెమ్మసాని వెనకడుగు వేసే వ్యక్తి కారన్నారు.పెమ్మసాని మాట్లాడుతూ ఎన్నో చోట్ల అవకాశం ఉన్నా మంగళగిరిని లోకేష్ ఎంపిక చేసుకోవడం ఈ ప్రాంతంపై ఉన్న మమకారానికి నిదర్శనం అన్నారు. టిడిపి మేనిఫెస్టోలో భాగంగా చేపట్టిన 'సూపర్ సిక్స్', 'బాబు ష్యూరిటీ, - భవిష్యత్తు గ్యారంటీ' వంటి హామీలను నియోజకవర్గంలో ప్రతి గుమ్మానికి చేర్చాలని సూచించారు. లోకేశ్ అందుబాటులో లేకపోతే ప్రజల కోసం తాను కూడా తిరగడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రతీ ఒక్కరూ కష్టపడి అత్యధిక మెజారిటీతో లోకేశ్ ను గెలిపించుకోవాలన్నారు. మంగళగిరి టౌన్, రూరల్, తాడేపల్లి టౌన్, రూరల్, దుగ్గిరాల మండల టీడీపీ నాయకులతో సమావేశమైన లోకేశ్ స్థానిక సమస్యలతో పాటు కార్యకర్తల పని తీరుపై రివ్యూ సమావేశం నిర్వహించారు.



గరిష్ట స్థాయికి పసుపు ధరలు

ప్రజాశక్తి దుగ్గిరాల : స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో బుధవారం పసుపు ధరలు గరిష్ట స్థాయికి చేరాయి. ఈ ధరలు ఈ సంవత్సరానికే గాక దాదాపు ఆరు సంవత్సరాల కాలానికి అధిక ధరలు. గత శుక్రవారం రూ.12 వేలకు చేరగా బుధవారం రూ.12125 రూపాయలు పలికినది. ఇంకా ధరలు పె రిగే అవకాశాలున్నట్లు వ్యాపారస్తులు తెలిపారు. నిజామాబాద్ సాంగ్లీ మార్కెట్లలో గత 20 రోజుల నుండి క్రొత్త పంట అమ్మకానికి వస్తుంది, అయినప్పటికీ ధరలు పెరగటం ఆశాజనకంగా మారినది. దాదాపు ఆరు సంవత్సరాలు నుండి రైతులకు గిట్టు బాటు ధరలు లేక పోవడంతో దేశవ్యాప్తంగా పసుపు సాగు గణనీ యంగా తగ్గినదని, ప్రస్తుతం విదేశాలకు ఎగుమతులు పెరిగాయని ఈ కారణం గానే ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. బుధవారం కనిష్ట ధర రూ.11400 గరిష్ట ధర రూ.12125 సగటు ధరలు రూ. 11990 రూపాయలు పలికినవి 601 క్వింటాళ్లు అమ్మకాలు జరిగాయి.

దేశ వ్యాప్తంగా సినిమా ఇండస్ట్రీ ఒక్కటవ్వాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



మాట్లాడుతున్న దిలీప్ రాజా

సినీ పరిశ్రమలో సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్ళాలంటే దేశ వ్యాప్తంగా సినిమా యూని యన్లు అన్నీ ఒక్కటైతేనే పరిష్కార మార్గం దొరుకు తుందని మూవి ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్, మా ఎపి వ్యవస్థా పకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. స్తానిక మా ఎపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ల మధ్య అసూయ, ద్వేషాలుంటే ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన కనిపించదన్నారు. 1952 సినిమాటోగ్రఫీ చట్టాన్ని సవరిస్తూ కేంద్రప్రభుత్వం 2023లో తీసుకువచ్చిన సినిమాటోగ్రాఫ్ చట్టంలో సవరణలకోసం భారతదేశంలో రిజిస్టర్ అయిన యూనియన్ల నుండి ప్రతినిధులను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పిలిపించి చర్చించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఒకప్పుడు సినిమా అంటే ఆర్థికస్తోమత ఉన్నవారి పరిశ్రమ నానుడి నుండి నేడు డబ్బులేనోళ్ళ వ్యాపారంగా మారిపోయిందన్నారు. కేంద్రప్రభుత్వం, నిర్మాతలు, పంపిణీ దారులు, ఎగ్జిబిటర్ల సంక్షేమం కోరుతూ దిలీప్ రాజా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం టాలీవుడ్ లో ఏడుగురు హీరోల సినిమాలకు మినహా మిగతా చిన్న సినిమాలకు ఓపెనింగ్స్ అంతగాలేవని ఆయన పేర్కొన్నారు. సినిమా రంగాన్ని కాపాడుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో రూ 1కోటి సబ్సిడీ ఇస్తుంటే ఆంధ్రలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కమిటీ సిఫారసు చేసిన సినిమాలకు కేవలం రూ.పదిలక్షలు సబ్సిడి ప్రకటించడాన్ని పునరాలోచన చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మంగళగిరి అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ పార్టీకి సలీం దరఖాస్తు

ప్రజాశక్తి - మంగళగిరి



విజయవాడ పీసీసీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్లో మంగ ళగిరి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా వడ్డేశ్వరంకు చెందిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ సలీం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు అందజేశారు. షేక్ సలీం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసా గుతున్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేశారు. గతంలో పది సంవత్సరాలు పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ కాపుసాధికారిక చైర్మన్ రేమినిశెట్టి హనుమంత రావు, నాయకులు కూర్మాల దుర్గాప్రసాద్ తదితరులు సలీం వెంట ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎల్.శివ శంకర్

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ పార్టీల, ఏఈఆర్ఓలతో జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ లో ఏఈఆర్‌వోలు, ఏఆర్వోల తో మాట్లాడారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవ ర్తన నియమావళి (ఎంసీసీ)ని కచ్చితంగా అమలు చేయాలని, గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో 87 శాతం పెంచాలని సంబంధిత అధికారులను, రాజకీయ నాయకులను ఆదేశించారు.జిల్లాలో త్వరలో జరగనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పెండింగ్‌లో ఉన్న ఫారమ్ లు 6,7,8 పూర్తి చేయాలని పేర్కొన్నారు. నోటి ఫికేషన్ జారీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎంసిసి అమల్లో ఉంటుందని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఈసీఐ జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేయ డం శిరోధార్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నియమాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అధికారీ నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ కొత్తగా విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లో ఉన్న అంశాలపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవ ర్తన నియమావళి అమలు, ఖర్చుల లెక్కింపు తదితర అంశా లపై ఎంసిసి బృందాలు, ఏఈఆర్ఓలు, వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, పోలీసు అధికారులు, వీడియో, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం పూర్తయినట్లు చెప్పారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఆర్డిఓ అజయ్ కుమార్, జి. రవి పాల్గొన్నారు.

'అమ్మ ఒడి' డబ్బు తిరిగి చెల్లించాలనడం విడ్డూరం

ప్రజాశక్తి-వినుకొండ

అమ్మ ఒడి పథకం నగదును తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని విద్యాశాఖకు ఆదేశాలు ఇవ్వడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ పథకం కింద సంవత్సరానికి రూ. 15,000 ఇస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్, ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. ఇచ్చిన డబ్బుల్ని తిరిగి చెల్లించాలని రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ విద్యార్థులకు అందని ద్రాక్ష లాగా నాణ్యమైన విద్య అందడం లేదని వారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ని ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'ప్రజా సేవ కోసమే తొలి అడుగు వేశా'

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రజలకు సేవ చేయాలనే ధృఢ సంకల్పం.. అంకిత భావంతో పనిచేసే వారికి ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందనే ప్రగాఢ విశ్వాసంతో తొలి అడుగు వేశానని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నలగడ్డ విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. సత్తెనపల్లి జేబిపి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ. పార్టీ తరపున తనను సత్తెనపల్లి ఎమ్మెల్యే గా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ అధినేత జడ శ్రావణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వండి పాలనలో దక్షత, దార్శనికతకు చిరునామాగా సత్తెనపల్లిని అబివృద్ధిలో కొంత పుంతలు తొక్కేలా చేస్తానని హామీ ఇచ్చారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో అమరావతి పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్. హుమాయున్ ఆధ్వర్యంలో కేకులు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హుమాయున్ మాట్లాడుతూ మండలంలో టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ పనిచేస్తుందని చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచంలో రెడీమేడ్ రంగంలో ప్రజలు ఆకర్షణ చూపడంతో టైలర్ల భవిష్యత్తు అగమ్య గోచారంగా మారి కుటుంబాల పోషణ కరువై దుర్భర స్థితిని అనుభవిస్తున్నారన్నారు. టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ నాయకులు గుబ్బ శ్రీనివాసరావు, షేక్ షబ్బీర్, బాజీ, జాన్ సైదా పాల్గొన్నారు.



ప్రజాశక్తి-అచ్చంపేట

అచ్చంపేట మండలం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం సెంటర్‌లో టైలర్స్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట వీధుల్లో టైలర్లు ర్యాలీగా ఆర్ అండ్ బి బంగ్లా చేరుకున్నారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులుగా తిరువాయి పాటి ఆంజనేయులు మాట్లాడుతూ టైలర్స్ కు కాంప్లెక్స్ భవనం నిర్మాణం గురించి గత కొన్నేళ్లుగా ప్రజా ప్రతినిధులను కలసి అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఎంతోమంది మహిళలు టైలర్ వృత్తిని నమ్ముకొని జీవనోపాధిని పొందుతున్నారన్నారు. టైలర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు ఇచ్చి వాళ్ళ జీవనోపాధికి దోహదపడాలని కోరారు. అనంతరం అచ్చం పేట మండలం టైలర్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సందె పోగు గాంధీని నూతన అధ్యక్షునిగా ఎన్ను కున్నారు. సీనియర్ టైలరు ఎస్ కె సైదు లను ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో పాల్గొన్న టైలర్స్ ఎస్కే హస్సేన్ కొంపల్లి బాలస్వామి, కె.కిరణ్ ఎస్.కె మౌలాలి, చిలక విజయ్, తిరువాయి పాటి హరికృష్ణ, చందలూరి గురునాథం, మహిళా టైలర్లు పాల్గొన్నారు



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా సమాజానికి ఏదోరకంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సత్తెనపల్లి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆదినారాయణ అన్నారు. టైలర్స్ డే సందర్భంగా క్యాలిబర్ జానీ సహాయసహకారాలతో అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని వివిధ వార్డులకు చెందిన నిరుపేద మహిళలకి బుధవారం చీరలు పంపిణీ చేశారు. సత్తెనపల్లి అర్ఐ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువత, మహిళలకి స్వయం శక్తితో ఎదిగే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం ఆది నారాయణను ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కె.దస్తగిరి,ట్రస్టు సభ్యులు పి.ప్రకాష్‌రావు, పి.రత్తయ్య, జి.గోవిందు, ఎస్.కోటేశ్వర రావు పాల్గొన్నారు



ప్రజాశక్తి-మాచర్ల

నూతనంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికను అందిపుచ్చుకోని టైలర్స్ అభివృద్ధి చెందాలని సీనియర్ రొటేరియన్ డాక్టరు కె.రామకోటయ్య



అమరావతిలో..

అన్నారు. పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో రోటరి క్లబ్ ఆధ్వర్యంలో పఠాన్ బుడే సాహెబ్ జ్ఞాప కార్థం టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్లు మద్దోజు కోటయ్య, మోదడుగు విజయలక్ష్మీ, అల వాల వెంకటేశ్వర్లు, తాటిపర్తి శేషారెడ్డి, అత్తరు సుభాని, రెబ్బల పలిల భాస్కర రావులను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని సత్యనారాయణ, పఠాన్ నాగూర్‌వలి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ శంకర్, క్లబ్ ప్రతి నిధులు, టైలర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



టైలర్ల సమ స్యల గురించి కృషి చేస్తానని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ హామీ ఇచ్చారు. టైలర్స్ డే సం దర్భంగా బుధవార సత్తెనపల్లి లోని మన్నెం రెసిడెన్సీ లో టైలర్ల కమిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే టైలర్స్‌కు అసోసియేషన్ భవనాన్ని నిర్మిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ సైద, టైలర్స్ శివప్రసాద్, రఫీ,అంకారావు టిడిపి కార్యనిర్వాక కార్యదర్శి యెలినేడి రామ స్వామి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వినుకొండ

టైలర్ల కుటుంబాలకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ అండగా ఉంటుందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు భార్య, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అన్నారు. టైలర్స్ డే సందర్భంగా స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని మసీదు మన్యంలో టైలర్స్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కుట్టు మిషన్ కనుగొన్న శాస్త్రవేత్త ఐజాక్ మెరిట్ సింగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ టైలర్లలో అధిక శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతూ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. టిడిపి జనసేన సంయుక్త ప్రభుత్వం రాగానే ఇల్లు లేని పేద దర్జీలకు జీవి ఆంజనేయులు ఆధ్వర్యంలో నివాస గృహాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. విద్యను అభ్యసించే దర్జీల పిల్లలు స్కాలర్షిప్లు అందజేస్తామని తెలిపారు.జూనియర్ టైలర్లకు శిక్షణ ఇవ్వాలని, తర్ఫీదు సమయంలో అయ్యే ఖర్చు ఫౌండేషన్ భరాయిస్తుందని, అసోసియేషన్ పెద్దలు ముందుకు రావాలని కోరారు.



అనంతరం మహిళ దర్జీ షేక్ ఆయుషాకు టిడిపి యువ నాయకులు షేక్ జానీ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్‌ను లీలావతి అందజేశారు. కార్య క్రమంలో టిడిపి నాయకులు షమీంఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, పివి. సురేష్ బాబు, అక్బర్ బాషా, అజంతా టైలర్ బాబు, ఇస్మాయిల్, ఎమ్మెస్ టైలర్ సైదా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-మాచర్ల

సర్ సివి రామన్ నేటి తరానికి ఆదర్శ నీయులని పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కోండారెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం స్థానిక చక్రధర్ డిగ్రీ కాలేజి నిర్వ హించారు. సర్ సివి రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో



చక్రధర్ డిగ్రీ కాలేజీలో..

పాల్గొన్న కుర్రి సాయిమార్కోండారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఆర్‌బిఐ ప్రతి నిధులు మాదాసు రాజ బాబు, ఏలూరి నాగరాజులు మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, ఆర్థిక నేరాలపై తీసు కోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిం చారు. జన విజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో కూడా సైన్స్ డే నిర్వహించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జి బిషన్ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి అర్బన్ సిఐ పి. శరత్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ శరత్‌బాబు మాట్లా డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హను మంతురావు, శ్రీధర్ గుప్తా, సదా శివరాజు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ చైతన్య స్కూల్ లో కూడా





క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

సైన్స్ డే కార్యక్రమాలు నిర్వ హించారు.

ప్రజాశక్తి-క్రోసూరు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానికు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానో పాధ్యా యురాలు సిస్టర్ మేరీ రజిత ముందుగా సివి రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్ని రంగాల్లో శాస్త్ర సాంకేతికతకు ఉన్న ప్రాముఖ్యతను గురించి వివరించారు. కేవలం సైన్స్ ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సైన్స్ ఎక్స్పోకు సంబంధించిన విద్యార్థులు చేసిన 120 ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించేందుకు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు లిడియా, సాయి లక్ష్మి, భవాని పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి -మేడికొండూరు

రాష్ట్ర ఆశా వర్కర్ల ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై నేతాజీ తెలిపారు. బుధవారం మేడికొండూరులో యూనియన్ అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈసభలో నేతాజీ మాట్లాడారు. 60 నుండి 62 సంవత్సరాలు వరకు రిటైర్మెంట్ వయస్సు పెంపుదల, పెంచుట, మట్టి ఖర్చులు రూ.20 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60 వేలు, వేతన మెటర్నిటీ సెలవు 180రోజులు తదితర డిమాండ్‌లు పోరాడి సాధించుకున్నారాని తెలిపారు .రాబోయే కాలంలో కూడా ఐక్యతగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల కన్వీనర్ బొట్ల రామకృష్ణ , అన్ని గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి మంగళగిరి



గుంటూరు నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్, దుగ్గిరాల పోలీస్ స్టేషన్లను గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన కేసుల వివరాలు నియంత్రణ చర్యలు శాంతి భద్రతల పరిరక్షణ ఎలక్షన్ సంబంధిత వివరాలను తదితర అంశాలపై మంగళగిరి టౌన్ సిఐ ఎం శ్రీనివాసరావు, రూరల్ సీఐ వెంకట్రావులను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి పట్టణం లోని టౌన్ స్టేషన్లో గల కంప్యూటర్లు, స్టేషన్ సిబ్బంది, విశ్రాంతిరూమ్, లాకప్ రూమ్, స్టోర్ రూమ్, తదితర ప్రాంతా లలో పర్యటించారు అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

చిరు వ్యాపారులకు ఆశీలు రద్దు చేస్తాం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరువ్యాపారులకు ఆశీలు ఫీజు రద్దుచేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఎన్‌ఆర్‌ఐ టిడిపి సహకారంతో చిరువ్యాపారుల ఆదాయాన్ని కనీసం 50శాతం పెంచే దిశగా అధునాతన యూరోకార్టు సేవలను లోకేష్ ప్రారంభించారు. రోడ్లవెంట టిఫిన్ బండ్లపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు పాశ్చాత్య దేశాల్లో మాదిరి అధునాతన సదుపాయాలతో కూడిన యూరో కార్టులను లోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్ సంక్షేమం పేరుతో కుడి చేత్తో రూ.10 ఇచ్చి, ఎడమచేత్తో వందలాగేస్తున్నారని అన్నారు. వీధివ్యాపారులకు వడ్డీలేని రుణాల పేరుతో 10వేలు ఇస్తున్నారని, ఇదే సమయంలో ఆశీలు పేరుతో ఏటా రూ.10,800 లాగేస్తున్నారని తెలిపారు. చిరువ్యాపారులు ఎక్కడైతే రోజువారీ బళ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారో, వారికి అక్కడే లైసెన్సులు ఇచ్చి పోలీసు వేధింపులు లేకుండా చేస్తామని తెలిపారు. చిరువ్యాపారుల బళ్లవద్ద చెత్తను మున్సిపాలిటీల ద్వారా సేకరించే విధంగా ఏర్పాటుచేస్తామన్నారు. యూరోకార్టులు



యూరో కార్డులను అందజేస్తున్న నారా లోకేష్

పొందిన లబ్ధిదారులకు బ్యాంకుద్వారా వర్కింగ్ క్యాపిటల్ సమకూరుస్తున్నందున అడ్డగోలు వడ్డీల బెడద ఉండదని తెలిపారు. శుభ్రత విషయంలో వెస్టన్ హోటల్ మేనేజ్మెంట్ వారిచే 5స్టార్ స్టార్స్ హోటల్స్ కి ధీటుగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ అధునాతన యూరోకార్టుల వల్ల చిరువ్యాపారుల ఆదాయం 50శాతం వరకు పెరుగుతుందని లోకేష్ అన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, నాయకులు ఎన్‌ఆర్‌ఐ టిడిపి కి చెందిన గుంటుపల్లి జై కుమార్, మురళీ రాపర్ల, యూరో కార్ట్ డిజైనర్ కష్ణం రాజు, వెస్ట్ ఇన్ ట్రైనర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకంలో మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి జగనన్న పాలవెల్లువ, పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, ఇళ్ళ నిర్మాణం, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక అధికారు, తహశీల్దారు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేవుట్లలో మంజూరు చేసిన ఇళ్ళు నిర్మాణాలు నిర్దేశిత స్థాయిలో ప్రతి వారం స్పష్టమైన పురోగతి కన్పించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి అడ్వాన్స్ క్రింద బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ళ నిర్మాణాలను ప్రారంభించుకొని పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు దశాల వారీగా ప్రభుత్వం పెండింగ్ లేకుండా నగదు జమ చేస్తుందని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన అనుమతి మంజూరు ఇళ్ళ నిర్మాణాలకు నగదు జమకు ఇబ్బంది ఉండదన్నారు. జగనన్న పాలవెల్లువ మూడవ విడతలో పాల సేకరణ ప్రారంభమైన గ్రామాల్లో నిర్దేశిత స్థాయిలో పాడి రైతుల నుంచి పాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీని ప్రారంభించాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్లోడ్, ఈకైవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు.

వాలంటీర్లతోనే సంక్షేమ పాలన : మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో వాలంటీర్లు ప్రజలకు మెరుగైన సంక్షేమ పాలనను అందించగలిగామని రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ తెలిపారు. వాలంటీర్ల సేవలకు విలువ కట్టలేమన్నారు. గుంటూరు జింఖానా ఆడిటోరియంలో బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వార్డు వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలను ఆమె ప్రదానం చేశారు. విడదల రజిని మాట్లాడుతూ వార్డు వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వంటి వారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. వాలంటీర్లు చేస్తున్న సేవకు గుర్తింపుగానే ప్రభుత్వం పురస్కారాలను అందజేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాన్ని ప్రజలు కళ్లారా చూశారని పేర్కొన్నారు. జన్మభూమి కమిటీల పేరెత్తాలంటేనే గతంలో ప్రజలు భయపడేవారని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే ఆక్రోశంతోనే ప్రతిపక్షాలు వాలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 1597



మంది వాలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. ఐదుగురికి సేవా వజ్ర, 18 మందికి సేవా రత్న, మిగతా 1574 మంది సేవా మిత్ర పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు.శాసనమండలి సభ్యుడు ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాలి గిరి, మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఓటమి భయంతో ప్రతిపక్షాలు వాలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల నుంచి ఏమీ ఆశించకుండా పనిచేస్తున్న ప్రభుత్వ సైన్యం వాలంటీర్లు అని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కాపాడుకోవాలి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నందు రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికుల ఓట్ల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చారని, సమస్యలు పరిష్కరించకుంటే వారే ఆయనను వచ్చే ఎన్నికలలో గద్దె దింపుతారని అన్నారు. ఈ నెల 29వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ల ఆఫీసులో ముందు జరిగే ఎటువంటి ధర్నాలు విజయవంతం చేయాలని కోరారు.

డిఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించిన వారికే ఓటు

ప్రజాశక్తి - మంగళగిరి

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారని 1998 క్వాలిఫైడ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అసోసియేషన్ నాయకులు బి శ్రీనివాసరావు వాపోయారు. బుధవారంస్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన వ్యక్తం చేసి మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కెకి ఈ సమస్యను వివరించామని తెలిపారు. ఆర్కే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చినట్లుగా శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తమకు ఉద్యోగాలు



ఇవ్వాలని అనేకసార్లు ఆందోళన చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాత్రం ఉత్తరాంధ్ర తమ జిల్లాలో వాళ్లకి ఇచ్చి రాయలసీమ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్లు పాల్గొన్నారు.



రాష్ట్రంలో వైసీపీకి మళ్లీ అధికారం ఖాయం : ఆర్కే

ప్రజాశక్తి - మంగళగిరి :ఆంధ్రప్రదేశ్లో మళ్లీ వైఎస్‌ఆర్సిపి అధికారంలో రావడం ఖాయమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కట్టిపోగు బసవయ్య వై నాట్ 175 కి సంఘీభావంగా ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు జరిగే పాదయాత్ర బుధవారం మంగళగిరి చేరుకుంది. మంగళగిరి పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీకి ప్రజలు మళ్ళీ ఓటు వేసి వైఎస్‌ఆర్సిపిని గెలిపించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్సిపి మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి, రాష్ట్ర మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల, తదితరులు పాల్గొన్నారు.



పేదల చెంతకే వైద్య సేవలు : ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి కొత్తపేట ఆర్ అండ్ బి బంగ్లా వద్ద బిఆర్ స్కూల్ ఆవరణలో బుధవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గణపతి నగర్లోని ఇందిరానగర్ డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్య నిపుణులు రోగులకు వైద్య సేవలు అందించారు.శిబిరాన్ని ఎమ్మెల్యే ఆర్కే, నియోజకవర్గ వైఎస్‌ఆర్సిపీ ఇన్చార్జి గంజి చిరంజీవితో కలిసి వైద్య శిబిరాన్ని సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూషను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. వారు వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నేత్ర పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా కళ్లజోళ్లు, రూ.25లక్షల వైద్య సేవలు పొందే ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర్ కమిషనర్ నిర్మల్ కుమార్,వైసిపి నాయకులు పాల్గొన్నారు.



గజవెల్లి స్పిన్నింగ్ మిల్లులో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - చేబ్రోలు : మండలంలో నారాకోడూరులో గజవెల్లి స్పిన్నింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ లో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, గుంటూరు అనుబంధ సంస్థ నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్పిన్నింగ్ మిల్ జనరల్ మేనేజర్ మత్యుంజయ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజువారి అలవాట్లతో సాధారణ కంటి చూపు ముందగిస్తుంది. అందుకే కళ్ళను జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత అని తెలిపారు. కార్మికుల సంక్షేమమే మిల్లు అభివృద్ధి అని అన్నారు. వైద్యులు షేక్ సైదా మాట్లాడుతూ కంటి సమస్యలు తలెత్తినప్పుడు దృష్టిలోపాలు ఏర్పడినప్పుడు వెంటనే డాక్టర్ని సంప్రదించి డాక్టర్ సలహాలు సూచనలు పాటించాలి అన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, పిఒ రాజా హాస్పటల్ సిబ్బంది మారుతి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ స్టోర్స్‌లో విజిలెన్సు తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



తెనాలి, మంగళగిరి పట్టణాల్లో పలు ఔషధ దుకాణాల్లో విజిలెన్స్. ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీలు నిర్వహించారు. బిల్లులు, ఫార్మాసిస్ట్ లేకుండా నాణ్యత లేని నాసిరకం మందులు అమ్ముతున్నారనే ఫిర్యాదులపై అధికారులు తెనాలి ,మంగళగిరి లోని పలు చోట్ల ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. తెనాలి లోని ప్రవీణ మెడికల్స్, సాయిబాబా అండ్‌కో దుకాణాల్లో పరిశీలించగా ఫార్మాసిస్ట్ లు లేరని, డాక్టర్ ప్రేస్క్రిప్షను లేకుండా మెడిసిన్స్ అమ్ముతున్నారని, అమ్మకపు బిల్లులు లేకుండా విక్రయాలు, షెడ్యూలు రిజిస్టర్ నిర్వహించకపోవడంపై కేసులు నమోదు చేశారు. అలాగే మంగళగిరి లోని శ్రీ భవాని మెడికల్ అండ్ జనరల్ స్టోర్, మాజేటి రాజేంద్ర మెడికల్ స్టోర్ తనిఖీలు చేసి కొనుగోలు బిల్లులు, అమ్మకపు బిల్లులు లేకుండా విక్రయాలు, రిజిస్టర్ నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇనస్పెక్టర్ ఎస్.శ్రీనివాసులు రెడ్డి, స్థానిక డ్రగ్ ఇన్స్పెక్టర్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న సిఇ శివప్రసాదరాజు తదితరులు

ఇంధన పొదుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిఎంసి ఎస్ఈ సుందర్రామిరెడ్డి అన్నారు. ఏపి స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపిఎస్ఈసిఎం) ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో జిఎంసి పంప్ ఆపరేటర్లకు ఇందన పొదుపుపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో త్రాగునీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు ఇందన పొదుపు అంశంలో ముఖ్యపాత్ర పోషిస్తారని అన్నారు. స్థానిక సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపునకే వినియోగిస్తున్నందున ఇతర అభివద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉండట్లేదని, కావున ఇంధన పొదుపు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అనంతరం పంప్ ఆపరేటర్లకు టూల్ కిట్లు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందించారు. శిక్షణలో సిఆర్డిపి సిఈ శివప్రసాదరాజు, ఈఈ శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లెయిమ్స్ పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23వ తేది నుండి అందిన క్లైమ్ లను పరిశీలించి పరిష్కరించాల్సి వుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమీషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్ఒ పెద్ది రోజా, ఆర్డిఓ శ్రీఖర్ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం ఫారం 6,7,8 లకు సంబంధించి మొత్తం 50,776 క్లెయిమ్స్ అందాయని, వీటిలో 33,335 క్లెయిమ్స్ పరిష్కరించడం జరిగిందని , మిగిలిన 17,441 క్లెయిమ్స్ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ మార్పు, 1500 ఓట్లు వున్న చోట క్రొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఈఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో కౌంటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొన్ని నియోజకవర్గాల నుండి ఫారం -8 కు సంబంధించి క్లెయిమ్స్ అందుతున్నాయని, వీటిపై ఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధపెట్టి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, కాంగ్రెస్ నాయకులు బిళ్ళా సునీల్, టిడిపి నుండి కె.శివరామయ్య, వైసిపి నుండి ఎ.జోసఫ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, జిఎంసి అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో నగర కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కారణంగా ఏమైనా మార్పులు చేస్తే వాటి వివరాలను బిఎల్‌ఓల ద్వారా ఓటర్లకు తెలియచేస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్-2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలను మార్చాల్సి ఉంటే వాటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, స్థానిక ఓటర్లకు తెలియచేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలు, క్లైయిమ్స్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధుల అర్జీలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు తీసుకొని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మరొకసారి పరిశీలించి, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియచేయాలని ఆదేశించారు. ఈ నెల 19 నుండి 25 వరకు తూర్పు నియోజకవర్గంలో 339, పశ్చిమ నియోజకవర్గంలో 510 వివిధ క్లైయిమ్స్ అందాయని, వాటిని బిఎల్‌ఓలు, సూపర్వైజరి అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వైజ్ఞానిక అంశాలపై నమూనాలు, ప్రాజెక్టులు తయారు చేసిన ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఆర్‌విఆర్ అండ్ జెసిలో..

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో నేషనల్ సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు సివి రామన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కళాశాల మెకానికల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.వి.ఎస్.సుధీర్ సీవీ రామన్ భౌతిక శాస్త్రంలో జరిపిన పరిశోధనలు, వాటి ఫలితాలను వివరిస్తూ 'యాన్సియెంట్ ఇండియా'స్ కాంట్రిబ్యూషన్ టూ సైన్స్ అండ్ టెక్నాలజీ -వికసిత్ భారత్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌లో క్విజ్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు



జైన్ హైస్కూల్లో..

సర్ సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ భారతదేశ వైజ్ఞానిక చరిత్రలో ఒక మైలురాయి అని జైన్‌హై స్కూల్ ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక జైన్ హైస్కూల్లో సైన్స్ ఎక్స్‌పో ఘనంగా నిర్వహించారు. పలు అంశాలపై విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై ప్రదర్శనలు రూపొందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



సుమేధా హైస్కూల్లో..

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో సైన్స్ కార్నీవాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజన్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ అభిలాష్, డాక్టర్ లతా ప్రారంభించారు. వివిధ అంశాలపై రూపొందించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలపతి విద్యా సంస్థల్లో..

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో పూర్వ విద్యార్థుల సంఘం, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అనాగ్రామ్, క్రాస్‌వర్డ్స్, ఆన్‌లైన్ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, పి.రత్నగీతా తదితరులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కాలేజిల్లో జాతీయ సైన్స్‌దినోత్సవం నిర్వహించారు. చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం. చంద్రశేఖర్, సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, ప్రసంగించారు.






కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండె ంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, ఏఒ కె.వెంకటరావు పాల్గొని సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను డాక్టర్ కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో డ్రోన్, హైడ్రాలిక్, లిఫ్ట్, నాడీ వ్యవస్థ, పిండము ఎదుగుదల, రక్త ప్రసణ వ్యవస్థ తదితర చార్టులు ప్రదర్శిం చారు.

గీతాంజలి హైస్కూల్లో..



స్థానిక ఏటి అగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో సివి రామన్ జయంతి సందర్భంగా సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సైన్స్‌ఎక్స్‌పోను స్కూల్ డైరెక్టర్ షేక్.హుస్సేన్ ప్రారంభించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ భారతదేశ వైజ్ఞానిక చరిత్రలో ఒక మైలురాయి పేర్కొన్నారు. అనంతరం మంచి ఎక్స్‌పోలు తయారుచేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్.షాంషాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేత హైస్కూల్లో...



స్థానిక ఏటిగ్రహారం రామిరెడ్డి నగర్‌లోని విజేత హైస్కూల్లో బుధవారం జాతీయ సైన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను స్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు సివి రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులు, పిండి వంటలు తయారు చేశారు. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు.